



తలమడుగులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

● బజార్‌హత్నూర్ మండలంలో సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర, దిష్టిబొమ్మ దహనం చేస్తున్న రైతులు(ఫైల్)





ఆందోళనలపై.. నజర్

- జిల్లాలో రుణమాఫీపై ఆందోళనలు, నిరసనల కట్టడికి రాష్ట్ర సర్కారు చర్యలు
- రుయ్యాడి గ్రామంలో 11 మంది రైతులపై కేసులు
- ఇంకా రుణమాఫీ కాని రైతుల గుర్తింపు కోసం స్పెషల్ డ్రైవ్
- ఒకవైపు పోటాపోటీగా నిరసనలు.. మరోవైపు క్షీరాభిషేకాలు
- రాజకీయ నేతల ప్రమేయంపై పోలీసుల ఆరా
- జిల్లావ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారిన రుణమాఫీ ఆందోళనలు

ఆదిలాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న రుణమాఫీ ఆందోళనలను ప్రభుత్వం ప్రత్యేకదృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. రైతుల ఆందోళనలు, నిరసనలను కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టింది. ఆదివారం రాత్రి తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన 11 మంది రైతులపై పోలీసు యాక్ట్ కింద కేసులు నమోదు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గత ఐదారేళ్ల క్రితం పత్తికి సరైన ధర రావడం లేదని ఆగ్రహించిన రైతులు ఆదిలాబాద్ మార్కెట్ కార్యాలయం పై దాడికి దిగడంతో 15 మంది రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం జూలై 18న మొదటి విడత, జూలై 30న రెండవ విడత, ఆగస్టు 15న మూడవ విడతలో రుణమాఫీని అమలు చేస్తూ వస్తుంది. ఇప్పటి వరకు మూడు విడతలను అమలు చేసినా.. పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదంటూ రైతులు ఆందోళనలకు దిగుతుతున్నారు. అయితే, సోమవారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల విభాగానికి వందలాది మంది రైతులు వచ్చి ఫిర్యాదు చేశారు. రైతుల్లో సరైన అవగాహన లేకపోవడమే ఈ ఆందోళనలకు అసలు కారణమని అధికారులు పేర్కొంటున్నారు. కానీ అన్నదాతకుల అవగాహన కల్పించడంలో సంబంధిత శాఖల అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలూ లేకపోలేదు. ఇప్పటి వరకు రుణమాఫీ కాని రైతులను గుర్తించి అర్హులైన వారందరికీ రుణమాఫీ జరిగేలా ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. కానీ రుణమాఫీ జరుగుతుందో? లేదో?నన్న అనుమానాలు, అపోహలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

శవయాత్రలపై వివాదం

రుణమాఫీ అమలుపై జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు, నిరసనలకు ఎలాంటి అనుమతులు లేవంటూ పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా సీఎం దిష్టిబొమ్మలతో శవయాత్ర చేయడం వివాదాస్పదంగా మారింది. శవయాత్ర వీడియోలను సోషల్ మీడియాలో పోస్టులు చేస్తూ వైరల్ చేయడం అధికార పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రుయ్యాడి గ్రామానికి చెందిన 11మంది రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. అలాగే మరికొంత మందిపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. అయితే సదరు రైతులకు ఇప్పటి వరకు రుణ విముక్తి కాలేదని తెలుస్తుంది. కొంతమంది రైతులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడాన్ని పోలీసులు తప్పుబడుతున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవంటున్నారు. ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసు కొచ్చి పరిష్కరించుకోవాలని సూచిస్తున్నారు.

పోటాపోటీగా కార్యక్రమాలు

జిల్లాలో రుణమాఫీపై ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలు చేపడుతున్నాయి. రైతులతో కలిసి బీఆర్ఎస్, బీజేపీలు రాస్తారోకోలు, ధర్నాలు, నిరసనలు, సీఎం దిష్టిబొమ్మతో శవయాత్రలను నిర్వహిస్తూ ఉండగా.. దానికి ధీటుగా అధికార పార్టీ నేతలు మండలాల్లో ముఖ్యమంత్రి చిత్ర పటాలకు క్షీరాభిషేకాలు చేస్తూ సంబరాలు జరుపుకుంటున్నారు. అదేవిధగా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరుగుతుందని భరోసానిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. రైతుల ఆందోళనలు, నిరసనలకు రాజకీయ రంగుపూయడంతో జిల్లా రాజకీయాలు మరింతగా హీటెక్కుతున్నాయి. అలాగే అధికార, ప్రతిపక్షాలు పోటాపోటీగా తీవ్ర విమర్శలు చేసుకుంటూ ఎదురుదాడికి దిగుతున్నారు.

దూకుడు పెంచిన ప్రతిపక్షాలు

ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీలో కొన్ని లోటుపాట్లు, సాంకేతిక లోపాలు బయట పడడంతో బీఆర్ఎస్, బీజేపీలు రైతుల ఆందోళనలను తమకు అనుకూలంగా మల్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి. దీంతో సీఎం శవయాత్రల వెనుక రాజకీయ నేతల ప్రమేయంపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది. అసలైన రైతులు కాకుండా రాజకీయ నేతలు ఆందోళనలో పాల్గొనడంతో పరిస్థితులు అదుపు తప్పే ప్రమాదం ఉందని పోలీసులు భావిస్తున్నారు. నేతల ప్రమేయంపై దర్యాప్తు జరుపుతున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా నిరసనలు, ఆందోళనలు, ర్యాలీలు చేయడంపై పోలీసులు ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. అయితే రైతుల పక్షాన శాంతియుతంగా పోరాటం చేస్తే ప్రభుత్వం కేసులు నమోదు చేస్తూ భయపెట్టే విధంగా ప్రయత్నిస్తోందని ప్రతి పక్షాలు ఆరోపిస్తున్నాయి.

మండలాల వారీగా అధికారుల నియామకం

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 19: ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ అమలులో పలు సమస్యలు తలెత్తడంతో జిల్లావ్యాప్తంగా రైతులు ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నారు. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను చేపట్టింది. సోమవారం మండలాల వారీగా నోడల్ అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశాలు జారీ చేశారు. దీనిలో భాగంగా ఎ.వివేక్‌ను ఆదిలాబాద్ అర్బన్‌కు సెల్ నెం.7288894007, పి.ప్రసాద్‌ను ఆదిలాబాద్ రూరల్‌కు సెల్ నెం.7288894028, కె.గంగారెడ్డిను మావలకు సెల్ నెం.9014208627, ఎండీ అష్రఫ్‌అహ్మద్‌ను జైనథ్‌కు సెల్ నెం. 7288894029 ఇ.సంధ్యారాణిను బేలకు సెల్ నెం.7288894030, జే.దివ్యను గాదిగూడకు సెల్ నెం.7288894078, జే.దేవేందర్‌ను నార్నూర్‌కు సెల్ నెం.9440716255, జే.కైలాస్‌ను ఇచ్చోడకు సెల్ నెం.7288894031, పి.ప్రవీణ్‌కుమార్‌ను సిరికొండకు సెల్ నెం.9014208726, బి.రమేష్‌ను గుడిహత్నూర్‌కు సెల్ నెం.7 288894032క, ఎం.ప్రమోద్‌రెడ్డిని తలమడుగుకు సెల్ నెం.7288894034, ఎ.రవీందర్‌ను తాంసికి సెల్ నెం.7288894033, డి.శంకర్‌ను భీంపూర్‌కు సెల్ నెం.9014208739, జి.రమేష్‌ను ఉట్నూర్‌కు సెల్ నెం.7288894052, జి.గణేష్‌ను ఇంద్రవెల్లికి సెల్ నెం.7288894051, వి.విశ్వామిత్రను బోథ్‌కు సెల్ నెం.7288894035, బి.భాస్కర్‌ను నేరడిగొండకు సెల్ నెం.7288894037, కె.అరుణను, బజార్‌హత్నూర్‌కు సెల్ నెం7288894036 నియమించడం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కేసులకు భయపడేది లేదు

: అనిల్‌జాదవ్, బోథ్ ఎమ్మెల్యే



రుణమాఫీ చేయాలంటూ న్యాయబద్ధంగా రైతులు నిరసనలు తెలుపుతుంటే.. ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతోంది. ప్రభుత్వం కేసులకు భయపడేది లేదు. రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తాం. అర్హులైన రైతులందరికీ వెంటనే రుణమాఫీ జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. రుయ్యాడి గ్రామ రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలి. జిల్లా రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. ఇప్పటి వరకు 40శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. నిబంధనల పేరిట రుణమాఫీ కాకుండా ప్రభుత్వం కుట్ర చేస్తోంది. రైతులు రుణమాఫీ చేయాలని అడిగితే ప్రభుత్వం రాజకీయం చేస్తోంది.

జిల్లాలో 30 యాక్ట్ అమలు

: జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్

జిల్లాలో 30యాక్ట్ అమల్లో ఉంది. అనుమతులు లేకుండా నిరసనలు, ర్యాలీలు, ఆందోళనలు చేపట్టరాదు. రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలి. రుయ్యాడి గ్రామంలో సీఎంను కించపరిచే విధంగా శవయాత్ర నిర్వహించడంతోనే పలువురిపై కేసులు నమోదు చేయడం జరిగింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు.



హస్నాపూర్ బ్యాంకు వద్ద పోలీసుల బందోబస్తు

బ్యాంకుల వద్ద భద్రత

ఉట్నూర్, ఆగస్టు 19: పంట రుణమాఫీ కోసం రైతుల ఆందోళనలు తీవ్రం కావడంతో బ్యాంకుల వద్ద పోలీసుల భద్రత ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజులుగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులతో కలిసి రైతులు పంట రుణమాఫీ కావడం లేదని కోరుకుంటు బ్యాంకుల ఎదుట ధర్నాలు చేస్తుండడంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా బ్యాంకుల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా పోలీసు అధికారి గౌస్‌ఆలం, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ గండికోట మొగిలిల ఆదేశాల మేరకు ఉట్నూర్ ఎస్సై మనోహర్ ఆధ్వర్యంలో ఉట్నూర్ పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దక్కన్ గ్రామీణ బ్యాంకు, జిల్లా సహకార బ్యాంకులతో పాటు షాంపూర్, హస్నాపూర్‌లలో ఉన్న తెలంగాణ దక్కన్ గ్రామీణ బ్యాంకుల ముందు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి బ్యాంకుల సేవలకు ఎలాంటి అవాంతరాలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

రాజ్యసభ అభ్యర్థిని కలిసిన ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, ఆగస్టు 19: హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలోని షేరటాన్ హోటల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన సీఎల్పీ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన అభిషేక్ మను సింఘ్వీను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి రాజ్యసభ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అభిషేక్ మను సింఘ్వీను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్‌మున్షి, మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా రక్షాబంధన్

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక.. అయిన రక్షాబంధన్ పండుగను జిల్లావ్యాప్తంగా ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. దీనిలో భాగంగా సోదరులకు రాకీలు కట్టేందుకు సోదరీమణులు దూర ప్రాంతాల నుంచి తరలిరావడంతో జిల్లాకేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం కిక్కిరిపోయింది. దీంతో బస్టాండ్ ప్రాంగణం మహిళలతో కిటకిట లాడింది. కాగా, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క హైదరాబాద్‌లో జరిగిన సీఎల్పీ సమావేశంలో రాఖీ కట్టారు. అలాగే, రక్షా బంధన్ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్రం సుగుణ రాఖీ కట్టారు. అలాగే, రక్షాబంధన్‌ను పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో గల సమావేశ మందిరంలో రేవతి బహెన్‌జి కలెక్టర్ రాజార్షిషాతో పాటు ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, అధికారులకు రాఖీలు కట్టారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా పోలీసు సిబ్బంది ఏఎస్పీ సురేందర్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ పోతారం శ్రీనివాస్‌లకు ఏఎస్సైలు జైస్వాల్ కవిత, వెంటమ్మ, కార్యాలయం మహిళా ఉద్యోగులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఎంపీ గోడం నగేష్‌కు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రంగినేని మనీష పాతహౌ జింగ్ బోర్డులోని ఎంపీ నివాసానికి వచ్చి రాఖీ కట్టారు. అలాగే, నేరడిగొండలో బోథ్‌నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు తన సోదరి రాఖీ కట్టారు. కాంగ్రె స్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డికి కైలాస్‌నగర్‌లోని ఆయన నివాసంలో పార్టీ మహిళా కార్యకర్తలు రాఖీ కట్టారు. అలాగే అన్ని మండలాల్లోనూ రాఖీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

– న్యూస్ నెట్‌వర్క్



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు



ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు రాఖీ కట్టిన జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క



ఎంపీ గోడం నగేష్‌కు రాఖీ కడుతున్న రంగినేని మనీష



బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు రాఖీ కడుతున్న ఆయన సోదరి



ఎమ్మెల్సీ కోదండరామ్‌కు రాఖీ కడుతున్న సుగుణక్క



కంది శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి



అదనపు ఎస్పీకి రాఖీ కడుతున్న మహిళా పోలీసు



పట్టణంలో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 19: ప్రజలు సమస్యల పై ఇచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వారి సమస్యలను తెలియజేస్తూ వినతులు ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ ఫిర్యాదుల విభాగంలో వచ్చే దర ఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయ, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుల విభాగానికి తరలివచ్చిన రైతులు

ప్రజావాణికి పోటెత్తిన రైతులు

● రుణమాఫీ కాలేదని కలెక్టర్‌కు వినతులు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 19: ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రైతులు పోటెత్తారు. ఇందులో రుణమాఫీకి సంబంధించిన దరఖాస్తులే అధికంగా వచ్చాయి. రుణమాఫీ కాలేదంటూ ఇంద్రవెల్లి మండలంలోని ధన్నూర్, బజార్‌హత్నూర్ మండలంలోని పిప్రి, ఇచ్చోడకు చెందిన రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. రైతులు మాట్లాడుతూ రుణమాఫీ త్వరగా అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ మండల వ్యవసాయాధికారికి వివరాలను అందజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ అందుతుందని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ రాజర్షి షా సూచించారు.

రేపటి భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి : మాల మహానాడు

ఉట్నూర్, ఆగస్టు 19: భారత ఉన్నత న్యాయస్థానం ఎస్సీలను వర్గీకరించాలని తీర్పు చెప్పడాన్ని నిరసిస్తూ మాల మహానాడు జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం బారత్‌బంద్ నిర్వహించాలని మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి దాసండ్ల ప్రభాకర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం సుప్రీంకోర్టు నేరుగా ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుపై ఉద్యమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఢిల్లీ కేంద్రంగా ధర్నాలు సైతం చేయడం జరిగిందని, మాలలు, మాల ఉపకులాల ఆధ్వర్యంలో సుప్రీంతీర్పు నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాలు మరింత తీవ్రం చేయనున్నామన్నారు. ఇందులో సమావేశంలో కాటంరమేష్, గొల్లపల్లి నరసయ్య, తాటిఆశన్న, దూట రాజేశ్వర్, బొంకంటి సుభాష్, సతీస్, తూట మహేందర్, కోడి ప్రభాకర్‌రావు, వినోద్, ఎర్రదండి సుశీల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


అస్సాం అటవీశాఖ అధికారులకు అవగాహన కల్పిస్తున్న లింగంపల్లి కృష్ణ

అటవీశాఖ అధికారులకు అవగాహన

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 19: అస్సాం రాష్ట్రానికి చెందిన అటవీ శాఖాధికారులకు ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ జిల్లా అడవుల్లో అరుదుగా కనిపించే పక్షుల గురించి వారికి అవగాహన కల్పించారు. కొలువులో కొత్తగా చేరి 45 రోజుల శిక్షణా నిమిత్తం అధికారులు అస్సాం రాష్ట్రం నుంచి హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ శిక్షణ కేంద్రం నుంచి ఆదిలాబాద్ జిల్లా మీదుగా మహారాష్ట్రలోని తడోబా పులుల సంరక్షణ కేంద్రానికి వెళ్లే క్రమంలో జిల్లా కేంద్రంలో ఉన్న మావలలోని హరితవనంలో ఆగి వనం తీరు గురించి తెలుసుకున్నారు. అడవుల్లో ఉండే పక్షులు వన్యప్రాణుల గురించి కృష్ణ చేస్తున్న పనిని ఎంతో మెచ్చుకుంటూ మంత్రముగ్ధులయ్యారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో శుభాష్, ఆదిలాబాద్ ఎఫ్ఆర్‌వో గులాబ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్‌లో సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర చేపట్టిన వారిపై కేసు

బజార్‌హత్నూర్, ఆగస్టు 19: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లో ఆదివారం సీఎం దిష్టిబొమ్మతో శవయాత్రను నిర్వహించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఒక్కో కుటుంబానికి రూ. 2లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది రైతులకు మాత్రమే మాఫీ చేసిందంటూ రుణమాఫీ కాని రైతులు ఆదివారం బజార్‌హత్నూర్‌లో సీఎం దిష్టిబొమ్మతో శవయాత్రను నిర్వహించారు. ఆ తర్వాత సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో ఎలాంటి అనుమతులు లేకుండా శవయాత్ర నిర్వహించినందుకు మండల కేంద్రానికి చెందిన తురాటి భోజన్న, అల్కె గణేష్, డుబ్బుల చంద్రశేఖర్, చట్ల వినీల్ పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అప్పారావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

● రుయ్యాడిలో 11 మందిపై కేసు నమోదు

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన 11 మందిపైకేసు నమోదు చేయడం జరిగిందని రూరల్ సీఐ ఫణీంధర్ తెలిపారు. వివరాల ప్రకారం రుయ్యాడి గ్రామానికి చెందిన కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండా ర్యాలీలు, నిరసనలు నిర్వహించారన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు పోలీసు యాక్టు ప్రకారం వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నిమ్మల సుదర్శన్‌రెడ్డి, పంద్రు పోతారెడ్డి, కుమ్మరి భూమన్న, అల్లూరి సతీష్‌రెడ్డి, గోక లక్ష్మారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నక్క ధనుంజయ్, నిమ్మల సూర్యసేన్‌రెడ్డి, దత్తు, కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా మరి కొంతమందిపై కేసు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. అదే విధంగా పోలీసుల అనుమతి లేకుండా ఆందోళన కార్యక్రమం చేపడితే శాఖపరమైన చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

సైబర్ క్రైం, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 19: ఆదిలాబాద్ పట్టణంలోని వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైం, యాంటీ ర్యాగింగ్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రాగి చట్టరిత్యా నేరమని, ర్యాగింగ్ పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. వీసైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా షీటీం సేవలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో బ్లేడుతో ఒంటిపై ఘాట్లు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 19: మద్యంతో మత్తులో ఓ వ్యక్తి బ్లేడుతో ఒంటిపై పలు చోట్ల కోసుకుని ఆత్మహత్య యత్నం చేసిన ఘటన ఆదిలాబాద్‌లో చోటు చేసుకుంది. ఇందిర నగర్ కాలనీకి చెందిన అల్లానూర్ అనే వ్యక్తి సోమవారం భీంసరి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన మద్యం మత్తులో బ్లేడుతో చేతులు, ఛాతిపై కోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం ఇవ్వగా సిబ్బంది నవీన్, ముజాఫర్ తీవ్ర గాయాలతో ఉన్న క్షతగాత్రున్ని రిమ్స్‌కు తరలించారు.

అడవి పంది దాడిలో రైతుకు గాయాలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 19: అడవి పంది దాడిలో ఓ రైతు గాయపడిన ఘటన ఆదిలాబాద్ రూరల్ మండలంలో సోమవార చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రూరల్ మండలంలోని అర్లి(బీ) గ్రామానికి చెందిన జాదవ్ సత్యాజి తన వ్యవసాయ పొలంలో పనిచేస్తుండగా ఒక్కసారి అడవి పంది దాడి చేసింది. దీంతో ఆయన కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అతనికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 19: పట్టణంలో ఓ వివాహిత అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. టూ టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎం.మదన్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మహాలక్ష్మి వాడకు చెందిన నసీర్-షబానా దంపతుల కుమారు నాందేడ్‌లో చదువుకుంటున్నాడు. కాగా తండ్రి నసీర్‌కు తన కుమారుడు అక్కడ చదువుకోవడం ఇష్టం లేకపోవడంతో కొడుకును ఆదిలాబాద్ తీసుకువచ్చారు. కాగా తన కుమారుడిని నాందేడ్‌లో చదవనీయకుండా ఇక్కడికి తీసుకురావడంతో భార్య షబానా బేగం భర్తపై కోపంతో ఈనెల 17న రాత్రి 10 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు, బంధువుల ఇళ్లలో గాలించిన ఆచూకీ తెలియరాలేదు. దీంతో భర్త నసీర్ ఫిర్యాదు మేరకు సోమవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 19: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారు గూడ సమీపంలోని డంపింగ్ యార్డ్ వెనుక పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్సై ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా వారి వద్ద నుంచి రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

● నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు



ఆసుపత్రిలో కార్యకర్తలకు ధైర్యం చెబుతున్న శ్రీహరి రావు

దిలావర్‌పూర్, ఆగస్టు 19: కార్యకర్తలకు అండగా ఉంటానని అధైర్య పడాల్సిన అవసరం లేదని డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు అన్నారు. ఈ మేరకు కాల్వ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త నిమ్మల లస్మయ్య కుమారుడు అనారోగ్యంతో ఇటీవల హైదరాబాద్‌లోని కామినేని హాస్పిటల్‌లో అడ్మిట్ కాగా, సమాచారం తెలుసుకున్న శ్రీహరిరావు ఆసుపత్రికి వెళ్లి లస్మయ్య కుమారుడిని పరామర్శించారు. ఆసుపత్రి డాక్టర్లతో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఈ సందర్భంగా లస్మయ్యకు ధైర్యం చెప్పారు. నేనున్నానని బాధ పడాల్సిన అవసరం లేదన్నారు. ఏ అవసరం ఉన్న ఫోన్ చేయాలన్నారు. దీంతో లస్మయ్య ఊరట చెందారు.

కెనాల్‌లో పడి వృద్ధురాలి మృతి

● ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్ గ్రామంలో విషాదం

● రాఖీ కట్టేందుకు వచ్చి తిరిగిరాని లోకాలకు..



ఖానాపూర్, ఆగస్టు 19 : రాఖీ కట్టేందుకు తమ్ముడి ఇంటికి వచ్చి ప్రమాదవశాత్తు పంట కాలువలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై లింబాద్రి తెలిపిన కథనం ప్రకారం... లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన రాళ్ల బండి చిన్నమ్మ(70) అనే మహిళ ఖానాపూర్ మండలం దిలావర్‌పూర్ గ్రామంలోని తన తమ్ముడైన రాసమల్ల బద్దయ్య అనే వ్యక్తికి రాఖీ కట్టేందుకని ఆదివారం దిలావర్‌పూర్‌కు వచ్చింది. కాగా సోమవారం ఉదయం బహిర్భూమి కోసమని గ్రామ శివారులో ఉన్న సదర్మాట్ కెనాల్ వైపు వెళ్లింది. కాల్వ కట్టపై నడుస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సదర్మాట్ కెనాల్‌లో పడింది. బహిర్భూమికని వెళ్లిన చిన్నమ్మ ఎంతసేపైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు ఆమెను వెతకడం ప్రారంభించారు. కాగా పాత ఎల్లాపూర్ గ్రామ శివారులో గల సైఫాన్ గేటు వద్ద ఆమె మృతదేహం లభించింది. మృతి చెందిన చిన్నమ్మకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కొడుకు విదేశాలలో ఉండగా రెండవ కొడుకు రాళ్ల బండి ముత్తన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్సై జి. లింబాద్రి తెలిపారు. తమ్ముడికి రాఖీ కట్టేందుకు వచ్చిన చిన్నమ్మ కాలువలో పడి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నిర్మల్ జిల్లాలో ఘనంగా రక్షాబంధన్



ఖానాపూర్‌లో సోదరులకు రాఖీ కడుతున్న చిన్నారి



దిలావర్‌పూర్‌లో అన్నలకు రాఖీ కడుతున్న చెల్లెమ్మ

ఖానాపూర్, ఆగస్టు 19 : అన్నా - చెల్లెలు, అక్క - తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన రక్షాబంధన్ వేడుకలను ఖానాపూర్ మండలంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమ సోదరులకు రాఖీలు కట్టి నిరంతరం సుఖశాంతులతో జీవించాలని సోదరీమణులు ఆశీర్వదించారు. రక్షాబంధన్ సందర్భంగా మహిళల రాకపోకలతో ఆర్టీసీతో పాటు ప్రైవేట్ వాహనాలన్నీ కిక్కిరిసిపోయాయి. రాఖీల దుకాణాల వద్ద మహిళల సందడి కనిపించింది. తమ ఇళ్లకు వచ్చిన సోదరీమణులకు విందు భోజనాలను ఏర్పాటు చేసి తోచిన కట్న కానుకలు చెల్లించి అన్నదమ్ములు వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

దిలావర్‌పూర్ : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా చెప్పుకునే రక్షాబంధన్ పండగను మండలంలో ఘనంగా నిర్వహించారు. అన్నదమ్ములకు అక్కచెల్లెళ్లు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆడపడుచులు అమ్మవారి ఇళ్లకు రాకతో గ్రామాలన్నీ కొత్త శోభను సంతరించుకున్నాయి. అందరూ ఆడపడుచులు ఒకేసారి తమ పుట్టిళ్లకు రావడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఆయా గ్రామాల్లో బస్టాండ్‌లు మహిళలతో సందడిగా మారాయి.

నర్సాపూర్(జి) : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు సోమవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఇళ్లలో ప్రత్యేక పూజలు చేపట్టారు. నూతన వస్త్రాలు ధరించి అక్క తమ్ముడికి , చెల్లి అన్నయ్యకు రాఖీ కట్టారు. నాకు నీవు రక్షా , నేను నీకు రక్షా , మనిద్దరం దేశానికి రక్ష అంటూ ఒకరికొకరు పండుగ మిఠాయిలు తినిపించుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు కౌట్ల(బి), స్వర్ణ, జామ్, బీరవెల్లి గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో సోమవారం ఘనంగా రాఖీ పౌర్ణమిని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నూతన వస్త్రాలను ధరించి ఆలయాల్లో పూజలు చేసి ప్రతి ఏడాది అన్నాచెల్లెళ్ల అనుబంధం ఎప్పుడు ఉండాలని మొక్కులను మొక్కారు. సోదరీమణులు సోదరులకు రాఖీలను కట్టారు. ఆనవాయితీగా సోదరులు సోదరీమణులకు నూతన వస్త్రాలతో పాటు బంగారు నగలను కానుకలుగా అందజేశారు. అనంతరం స్వీట్లను ఒకరికొకరు పంచిపెట్టుకున్నారు. దీంతో గ్రామాల్లో పండగ సందడి నెలకొంది.

తానూర్ : రాఖీ పౌర్ణమను పురష్కరించుకొని మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో రాఖీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అక్కచెల్లెళ్లు తమ అన్నదమ్ముల్లకు రాఖీలనుకట్టి మిఠాయిలను పంచుకున్నారు. అన్నచెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుంది.

ముథోల్ : అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి వేడుకలను సోమవారం ముథోల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి తిలకం దిద్ది మిఠాయిలను ఇచ్చి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అన్నదమ్ములు తమ తోబుట్టువులకు కానుకలు అందజేశారు. అలాగే శిశు మందిర్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముథోల్‌లో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు విద్యార్థులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ ఒకరికొకరు రాఖీ కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకలను జరుపుకున్నారు.

కుభీర్ : మండల కేంద్రం కుభీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం రక్షబంధనం(రాఖీపౌర్ణిమ) వేడుకలను ఘనంగా నిర్వహించారు. అక్కచెల్లెల్లు అన్నతమ్ముళ్లకు రాఖీ కట్టి ఆశీర్వదించారు. ఒకరికొకరు స్వీట్లను పంచుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో రాఖీ పండగను ఘనంగా నిర్వహించారు. నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనమిద్దరం కలిసి దేశానికి రక్ష అంటూ విద్యార్థులు ఒకరికొకరు రాఖీలను కట్టుకున్నారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ రాఖీలను కట్టారు.



ముథోల్ ఎమ్మెల్యేకు రాఖీ కడుతున్న చిన్నారులు



ఇంటింటికి తిరుగుతూ రాఖీలను కడుతున్న విద్యార్థులు

ఎడ్‌బిడ్ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

ముథోల్, ఆగస్టు 19 : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో మిషన్ భగీరథ ఏఈఈ దుర్గం సుమన్‌కు విధి నిర్వహణలో ఆటంకం కలిగించిన ఘనటలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన రాజారెడ్డిలపై ముథోల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ఆగస్టు 15వ తేదీన ఎడ్‌బిడ్ గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ పంప్ హౌస్‌లో పని చేసే వాటర్ మెన్ ప్రభాకర్(36) గుండెపోటుతో మృతి చెందాడు. అయితే మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఏఈఈ దుర్గం సుమన్ సంఘటన స్థలానికి వెళ్లారు. దీంతో సురేందర్ రెడ్డి, రాజారెడ్డిలు నాపై దాడి చేసి, విధులకు ఆటంకం కలిగించటమే కాక, నాపై దాడికి పాల్పడ్డారని, అలాగే ప్రజలను రెచ్చగొట్టారని ఏఈఈ దుర్గం సుమన్ ముథోల్ పోలీస్ స్టేషన్‌లో ఘటన జరిగిన రెండు రోజులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ విషయం ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఎస్సై సాయికిరణ్ విచారణ చేపట్టారు. ఏఈఈ ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై 132 బీఎన్‌ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు అయిందని పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడి కుటుంబానికి న్యాయం చేయటానికి ప్రయత్నం చేస్తే కావాలని మిషన్ భగీరథ ఏఈఈ కేసులు పెట్టడం సరికాదని పలువురు పేర్కొంటున్నారు.

విద్యార్థిపై మరో విద్యార్థి బ్లేడుతో దాడి



మామడ, ఆగస్టు 19 : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థికి బ్లేడుతో కోసి గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థి నిద్రిస్తున్న సమయంలో తోటి విద్యార్థి బ్లేడుతో కోసి కాలుకు గాయపరిచారు. శనివారం రాత్రి ఓ విద్యార్థికి మరో విద్యార్థి బ్లేడుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో గాయపడిన విద్యార్థి ఆదివారం రాత్రి తన తండ్రికి ఫోన్ ద్వారా ఈ విషయాన్ని చెప్పడంతో విద్యార్థిని ఇంటికి తీసుకువెళ్లారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. సోమవారం విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఈ విద్యార్థిపై రెండుసార్లు మరో విద్యార్థి బ్లేడుతో దాడి చేశాడని, ఉపాధ్యాయులకు చెప్పిన పెడచెవిన ఎందుకు పెట్టారని, జరగరాని సంఘటన జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో ముత్యం పాఠశాలను సందర్శించి విద్యార్థిని విచారించగా సరదాగా తానే బ్లేడుతో తోటి విద్యార్థిని గాయపరిచానని తప్పును ఒప్పుకున్నాడు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థికి టీసీ ఇచ్చి పంపించాలని డిమాండ్ చేశారు. ఇట్టి విషయమై ఉన్నతాధికారులకు తెలియజేస్తానన్నారు.

నిరీక్షణ గదులను తెరిపించాలి

● అధికారులకు కలెక్టర్, పీవోల ఆదేశాలు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



ఉట్నూర్‌లోని ప్రసవ నిరీక్షణ గదులను సందర్శించిన ఏడీఎంహెచ్‌వో

ఉట్నూర్, ఆగస్టు 19: 'అలంకారప్రాయంగా నిరీక్షణ గదులు' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా పేజీలో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త స్పందించారు. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా నిర్మించిన ప్రసవ నిరీక్షణ గదులను పునరుద్ధరించాలని, ఎవరైనా స్వాధీన పరుచుకుంటే వెంటనే ఖాళీ చేయించాలని ఆదేశించడంతో జిల్లా ఏజెన్సీ అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుడిమెత మనోహర్ సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని సివిల్ ఆసుపత్రి వద్ద ఉన్న ప్రసవ నిరీక్షణ గదులను సందర్శించి తెరిపించారు. మంచిర్యాల జిల్ల కేంద్రంలోని ప్రసవ నిరీక్షణ గదులలో క్షయవ్యాధి నివారణ కార్యాలయం ఉన్న మాట వాస్తవమని దానిని వెంటనే ఖాళీ చేయిస్తామని తెలిపారు. జైనూర్ మండల కేంద్రంలోని ఆసుపత్రి వద్ద ఉన్న ప్రసవ నిరీక్షణ గదులలో సిబ్బంది ఉంటున్నారని, అదే విధంగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రి వద్ద ఉన్న నిరీక్షణ గదులలో 102 సిబ్బంది ఉంటున్నారని, వారిని వెంటనే ఖాళీ చేయిస్తామని, ప్రసవ గదులలో గర్భిణులకు ఆశ్రయం కల్పించి సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నిరీక్షణ గదులకు అవసరమైతే మరమ్మతులు చేయిస్తాని అన్నారు. కొత్తగా నేరడిగొండ, బజార్‌హత్నూర్, సిర్పూర్(యు), ఇంద్రవెల్లి మండల కేంద్రాలలోని పీహెచ్‌సీల వద్ద కూడా నిరీక్షణ గదులు నిర్మించడం జరిగిందని, వాటిని త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. వాంకిడి, కౌటాల, బెజ్జూర్, ఝరి, భీంపూర్‌లలో ప్రసవ నిరీక్షణ గదులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. త్వరలోనే ఏఎన్‌ఎంలు ఆశా వర్కర్ల సమావేశం ఏర్పాటు చేసి ప్రసవ సమయం దగ్గర పడ్డ మహిళలను సమీపంలో ఉన్న ప్రసవ నిరీక్షన గదులకు రప్పించేలా చేసి బాలింతలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఆయన వెంట హెల్త్ సూపర్‌వైజర్లు కుమ్రశిరిఫ్‌కుమార్, నాందేవ్, శ్రీనివాస్, కైలాస్, దావత్ తదితరులు ఉన్నారు.

రైతులపై కేసులను ఉపసంహరించుకోవాలి

● నిబంధనలు లేకుండా రుణమాఫీ చేయాలి : ఎమ్మెల్యే

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్



తలమడుగు, ఆగస్టు 19: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి కొంతమందికి రుణమాఫీ చేయడం పట్ల రుణమాఫీ కాని రైతులు నిరసన వ్యక్తంచేస్తే వారిపై కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని రుయ్యడి గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం రుయ్యడి గ్రామ రైతుల మీద అక్రమ కేసులు పెట్టడం కాదుచ ఈ ప్రభుత్వానికి సోయి ఉంటే రైతు ఈ ప్రభుత్వానికి రైతుల మీద ప్రేమ ఉంటే రైతులకు రుణమాఫీ చేయాలి.. కానీ రైతు రుణమాఫీ కాని రైతులు ప్రభుత్వానికి నిలదీస్తే అక్రమ కేసులు పెట్టడం అంటే ఈ ప్రభుత్వం నియంత పాలనికి నిదర్శనం అని అన్నారు. ఎన్నికల సమయంలో పదవుల కోసం సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను పెట్టిన అక్రమ కేసులను ఉప సంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రుయ్యాడి గ్రామానికి చెందిన బాధిత రైతులను పరామర్శించి వారికి అండగా ఉంటామని అన్నారు.

● రైతుల మీద కేసులు పెట్టడం సరికాదు

ఈ ప్రభుత్వానికి రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే రైతులకు సంపూర్ణ రుణమాఫీ చేసి రైతులతో క్షీరాభిషేకం చేసుకోవలే కానీ కనీసం 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. పాస్ బుక్ ప్రామాణికంగా రుణమాఫీ చేయాలి కానీ కుటుంబానికి రూ.2 లక్షలు అని చెప్పి ఇంకా రూ.లక్షా ఇరవై వేలు ఉన్న రైతులను కూడా రుణమాఫీ కాలేదన్నారు. రైతుల మీద కేసులు పెడితే రైతు ఉద్యమానికి కూడా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

'కరెంట్ కష్టాలు లేకుండా చూడాలి'

నార్నూర్, ఆగస్టు 19: విద్యుత్ శాఖ అధికారులు నియమ, నిబంధనలు పాటించకుండా విద్యుత్‌కి అంతరాయం కలిగిస్తున్నారని మండల కేంద్రానికి చెందిన గ్రామస్థులు సోమవారం నిరసన తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక దుర్గానగర్ ఏరియాలో ఒక లైన్‌లో కరెంట్ సరిగ్గా ఉండడం లేదని, పైగా వర్షాకాలం చుట్టుపక్కల అన్ని పంట పొలాలు, చెత్తాచెదారం పెంటకుప్పలు ఉన్నాయని వాపోయారు. గడ్డిదోమలు, విషపురుగుల వల్ల ఇబ్బంది పడుతున్నామని, చీకట్లో ఇంట్లోకి వస్తున్నాయన్నారు. ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరిదీ బాధ్యత అని ప్రశ్నించారు. విద్యుత్ శాఖ అధికారులు ఈ సమస్యపై విన్నవించినా వారు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్థులు అధికారుల పనితీరుపై మండిపడ్డారు. కరెంట్ కష్టాలు లేకుండా నిరంతరం విద్యుత్ అందించాలని, లేనియెడల తామంతా నిరసన, ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఇందులో విజయ్‌సింగ్, ఆడే శీను, రోహిదాస్, తదితరులు అన్నారు.



నిరసన తెలుపుతున్న దుర్గానగర్ వాసులు



మత్తడిగూడ గిరిజనులు పూజలు చేస్తున్న దృశ్యం

ఆదివాసీ గిరిజనుల నవోంగి పూజలు

ఉట్నూర్, ఆగస్టు 19: మండలంలోని మత్తడిగూడలో ఆదివాసీ గిరిజనులైన సిడాం వంశీయులు సోమవానం నవోంగి పూజా కార్యక్రమం నిర్వహించారు. ప్రతీయేడాది మొదటి పంట దిగుబడులైన మినుములు, బొబ్బర్లు పంట చేతికి రావడంతో కొత్త దినుసులను నవ్వోంగ్‌గా ఆదివాసీ గిరిజనులు తమ సంస్కృతీ, సంప్రదాయాలబద్ధంగా గ్రామ పొలిమేరలకు వెళ్లి సిడాం వంశీయుల ఆధ్వర్యంలో పూజలు చేసి తమ ఆరాధ్య దైవాలకు నైవేద్యంగా సమర్పించడం గిరిజనుల ఆనవాయితీగా వస్తోంది. సిడాం వంశీయులు కొత్త పంట దిగుబడులను ముందుగా దేవతలకు సమర్పించి సామూహిక పూజలు చేశారు. ఇందులో సిడాం సోనేరావు పటేల్, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం జంగుదేవ్, కటోడా, సిడాం జైతు, సిడాం భగవంత్, రాంశావ్, హన్మంతు, లింబారావు, ప్రసాద్ సిడాం, లచ్చు పటేల్, భీంరావు, శేషు, దేవులు, తదితరులు పాల్గొన్నారు.





నామినేటెడ్ ఇంకెప్పుడు?

- జిల్లా నేతలకు దక్కని రాష్ట్రస్థాయి పదవులు
- మార్కెట్ కమిటీ పదవులపై సీనియర్ నేతల నజర్

నిర్మల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవులపైనే జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు గంపెడాశలు పెట్టుకున్నారు. జిల్లాలో ఆ పార్టీ కేడర్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఏ ఒక్క పదవి కూడా దక్కకపోవడం పట్ల చాలా మంది సీనియర్ నాయకులు తమకు పదవి ఎప్పుడు దక్కుతుందా!? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రస్థాయి కార్పోరేషన్‌లకు సంబంధించి ఇప్పటి వరకు ఏ ఒక్క సీనియర్ నేతకు కూడా పదవి రాకపోవడం పార్టీలోని అసంతృప్తికి ఆజ్యం పోస్తోంది. ఇప్పటికే జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రుల వద్ద, అలాగే రాష్ట్రస్థాయి నాయకుల వద్ద కూడా ఈ వ్యవహారాన్ని కొంతమంది సీనియర్ నాయకులు ప్రస్తావించినట్లు చెబుతున్నారు. అయితే అధిష్ఠానం ఇక్కడి నేతల వైపు కన్నెత్తి చూడకపోతుండడంతో కార్యకర్తలంతా తీవ్ర అసహనానికి లోనవుతున్నారని చెబుతున్నారు. ఎన్నికల సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా తామంతా పోరాటం చేసి ఎన్నో రకాల ఒత్తిడులకు గురయ్యామంటూ వారంతా వాపోతున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల సంగతి దేవుడేరుగు గానీ కనీసం జిల్లాస్థాయి పదవులనైనా తమకు కట్టబెట్టాలంటూ సీనియర్ నాయకులు పార్టీ పెద్దలను కోరుతున్నారు. జిల్లాలోని ఐదు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు వైస్ చైర్మన్, డైరెక్టర్ పదవులను ఇప్పటి వరకు భర్తీ చేయకపోవడం పట్ల పలువురు సీనియర్ నాయకులు అధిష్ఠానం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో పాటు జిల్లాలోని ప్రధాన దేవాలయాల పాలక వర్గాల కమిటీల పదవులను కూడా భర్తీ చేయకపోవడమేమిటంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో పాటు జిల్లా స్థాయిలో ఉండే వివిధ డైరెక్టర్ పోస్టులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని కూడా ఇప్పటి వరకు ఏ ఒక్క నేతకు కట్టబెట్టలేదు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం పార్టీకి చెందిన కొంతమంది సీనియర్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే వీరంతా తమ అభ్యర్థనలను ఎమ్మెల్యేతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావుతో పాటు అలాగే అధిష్ఠానానికి వివరించారు. కాగా పదవుల పంపకం జరగకపోతుండడంతో క్రమంగా పార్టీలో తీవ్రమైన అసంతృప్తిని రగిల్చే అవకాశాలున్నాయంటున్నారు. పదవుల పంపకం జరగకపోతుండడంతో అసంతృప్తికి లోనవుతున్న పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలపై బీజేపీ నేతలు దృష్టి సారిస్తున్నారంటున్నారు. ఈ అసంతృప్తిని ఆసరాగా మలుచుకొని అసంతృప్తి వాదులందరినీ పార్టీవైపు రప్పించేందు కోసం కొంతమంది సీనియర్ కాంగ్రెస్ నేతలు ఇప్పటికే రంగంలోకి దిగి తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారంటున్నారు. మొత్తానికి చిలికి చిలికి గాలివాన కాకముందే కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల విషయంలో దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టి ఈ పదవుల పంపకాన్ని ముమ్మరం చేయాలని అంటున్నారు.

మార్కెట్ కమిటీ పదవులపై సీనియర్‌ల నజర్..

జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, కుభీర్, సారంగాపూర్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులపై పలువురు సీనియర్ నేతలు దృష్టి కేంద్రీకరించారు. వీరంతా మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా కృషి చేయడమే కాకుండా గత పది సంవత్సరాల నుంచి అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీతో అమీతుమీకి సిద్ధమయ్యారు. అనేక ఒత్తిడులు, ప్రలోభాలకు వీరంతా తలవంచకుండా కాంగ్రెస్ పార్టీ కోసం కట్టుబడి కొనసాగుతున్నారు. అయితే ఈ సారి పార్టీ అధికారంలోకి రావడంతో తమకు కీలక పదవులు వస్తాయని వీరంతా ఆశ పడుతున్నారు. కీలకమైన నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని సీనియర్ నేతలైనా మేడిపెల్లి భీంరెడ్డి, రత్నాపూర్ కాండ్లికి చెందిన మాజీ సర్పంచ్ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు అజార్, గుండంపెల్లికి చెందిన సాగర్‌రెడ్డి, మామడకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి, రఫీ, నిర్మల్ పట్టణానికి చెందిన పూదరి అరవింద్, ఆడ్ప శ్రీకాంత్ తదితరులు మార్కెట్ చైర్మన్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీంతో పాటు లక్ష్మణచాంద మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్, సిద్దిలకుంటకు చెందిన గడ్డం పెద్ద నర్సారెడ్డి, గాజుల రవికుమార్, మంజులాపూర్‌కు చెందిన ప్రశాంత్, నర్సాపూర్‌కు చెందిన గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డిలతో పాటు ఓ జర్నలిస్టు కూడా ఈ పదవి నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై కన్నేశారంటున్నారు. ఇప్పటికే వీరంతా వేరు వేరుగా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావును కలిసి తమకు పదవుల విషయంలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. అయితే పదవుల కేటాయింపు వ్యవహారం ఎంతో సున్నితమైనదిగా గుర్తించిన అధిష్ఠానం బలమైన నేతల కోసం గాలిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో పాటు భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రేసులో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, ఓం ప్రకాష్ లడ్డాలతో పాటు తదితరులు మొదటి వరుసలో ఉన్నట్లు చెబుతున్నారు. కాగా ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రయత్నాలు మొదలుపెట్టారంటున్నారు. ఖానాపూర్ మండలం నుంచి కట్ట శ్రీనివాస్, రాజేశ్వర్, మైస శ్రీనివాస్, నేరేళ్ల సత్యనారాయణ, గోర్రె గంగాధర్, జన్నారపు శంకర్‌లతో పాటు తదితరులు ఈ పదవి కోసం పట్టుబడుతున్నట్లు చెబుతున్నారు. వీరితో పాటు కడెం మండలం నుంచి బొడ్డు గంగన్న, జాడే ఇందూర్, దుర్గా భవాని, శనిగారపు కమలాకర్, పడిగెల భూషణ్, శంకర్ తదితరులున్నారు. పెంబి మండలం నుంచి మల్లెపెల్లి స్వామి, దస్తూరాబాద్ మండలం నుంచి దుర్గం మల్లేష్‌లు ఖానాపూర్ మార్కెట్ చైర్మన్ పదవి కోసం ఎమ్మెల్యే వెడ్మబొజ్జు మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం బొల్లోజి నర్సయ్య, దశరథ రాజేశ్వర్, చించోలి శ్రీనివాస్ రెడ్డి, రొడ్డ మారుతిలు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారంట్యున్నారు. రాష్ట్రస్థాయి సీనియర్ నేతలతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుపై వీరంతా ఒత్తిడి చేస్తున్నారని చెబుతున్నారు. కాగా కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం అక్కడి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులైన శంకర్ చంద్రే, కల్యాణ్, గోరేకర్ బాబు, సతీశ్, రమేష్‌లతో పాటు తదితరులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారంటున్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం సీనియర్‌ల పట్టు...

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం ఈ సారి నిర్మల్ నుంచే కాకుండా ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల నుంచి చాలా మంది సీనియర్ నాయకులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే డీసీసీ అధ్యక్ష పదవి నిర్మల్ నియోజకవర్గనేత ఆధీనంలో ఉన్న కారణంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని తమకే కేటాయించాలంటూ ఇటు ముథోల్, అటు ఖానాపూర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేతలు పట్టుబడుతున్నారు. దీంతో పాటు ఖానాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే, ముథోల్ మాజీ ఎమ్మెల్యేలు గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి కోసం అధిష్ఠానంపై ఎవరికి వారే ఒత్తిడి తీసుకువస్తున్నారంటున్నారు. దీంతో పాటు నిర్మల్‌కు చెందిన సీనియర్ నేతలు కూడా పట్టుపడుతున్నారు. నామినేటెడ్ పదవుల వ్యవహారం పార్టీకి సవాలుగా మారింది.

కదిలి వచ్చిన భక్తజనం

- కిక్కిరిసిన పాపన్నలొద్ది



పాప హరేశ్వర స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

దిలావర్‌పూర్, ఆగస్టు 19 : పురాతన శైవక్షేత్రం కదిలి పాపహరేశ్వరాలయం భారీగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం మూడవ సోమవారం పౌర్ణమి కలిసి రావడంతో పాపహరేశ్వరస్వామి దర్శనభాగ్యం కోసం భక్తులు బారులు తీరారు. అంతకుముందు గోముఖ గుండంలో పవిత్రస్నానాలు చేసిన భక్తులు మహావటవృక్షానికి ప్రదక్షిణలు చేశారు. అనంతరం శ్రీ మాతాన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకున్నారు. పాపహరేశ్వరస్వామికి పంచామృతాభిషేక పూజలు, అన్నపూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల నుంచి వందలాదిగా తరలి వచ్చిన భక్తులతో కదిలి లొద్ది జనసంద్రంగా మారింది. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు నిర్మల్ పట్టణానికి చెందిన శ్రీదేవి, రవికుమార్ దంపతులు అన్నదానం చేశారు. కాగా అన్నదాతలకు దేవస్థానం తరపున చైర్మన్ వెంకట్‌రావు పటేల్, మాజీ చైర్మన్ భుజంగ్ రావు పటేల్, మాడేగాం ఉప సర్పంచ్ మారుతి రావు పటేల్, రమేష్, భూమేష్, రవి, తదితరులు సన్మానం చేసి స్వామివారి లడ్డు ప్రసాదం అందజేశారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

- సూర్యాపూర్ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాంరావు పటేల్

కుంటాల, ఆగస్టు, 19: శ్రావణ సోమవారం పురస్కరించుకొని, రాఖీ పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రం కుంటాల, ఓలా శివాలయాలతో పాటు సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణమాసం పురస్కరించుకొని భ క్తులు ఉదయం నుండే శివాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించి శివునికి ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే రాంరావు పటేల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయకమిటీ, గ్రామస్తులు స్వాగతం పలికి అర్చన, అభిషేకం తది తర కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయాల విశిష్టతను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రావణ మాసంలో శివాలయాల్లో పూజలు నిర్వహిస్తే కోరికలు నెరవేరుతాయని ప్రజలకు నమ్మకమన్నారు. మండలంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ముగ్గురు లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబు, మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, ఎంపీడీవో రహీం, డీటీ నరేష్ గౌడ్, జిల్లా నాయకులు రమణ రావు, వెంగల్‌రావు, మునీశ్వర్‌రాజు, గంగయ్య, గజేంధర్, తదితరులు ఉన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్




దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 19 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా పనిచేయాలన్నారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై చర్చించారు. డీఆర్‌వో భుజంగరావు, ఆర్డీవో రత్నకళ్యాణితో పాటు పలు శాఖల ప్రభుత్వ అధికారులు ప్రజావాణిలో పాల్గొన్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికులకు తప్పని తిప్పలు

- రాఖీ పండుగతో పెరిగిన రద్దీ
- మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సుల్లో కిక్కిరిసిన ప్రయాణం
- సరిపడా బస్సులు లేక అవస్థలు పడ్డ జనం



ప్రయాణికులతో రద్దీగా ఉన్న బస్టాండ్‌లు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 19 : జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, భైంసా తదితర ప్రధాన పట్టణాల్లో గల బస్టాండ్‌లలో సోమవారం ప్రయాణికుల రద్దీ విపరీతంగా కనిపించింది. రాఖీ పండగ కావడంతో మహిళలు తమ బంధువుల ఇళ్లకు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించారు. దీనికి తోడు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులో ఉండడంతో చాలా మంది మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను నడపకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్ లలో ఎదురుచూడాల్సి వచ్చింది. చాలా రూట్‌లలో బస్సులు పరిమితికి మించి మూడింతలకు పైగా కిక్కిరిసి ప్రయాణించడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో గంట పాటు ఏకధాటిగా భారీ వర్షం



జిల్లా కేంద్రంలో వరద నీటిలో కొట్టుకుపోతున్న వాహనాలు



భారీ వర్షంతో నిలిచిపోయిన వాహనాలు

నిర్మల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 3.6 మిల్లీమీటర్లు కాగా జిల్లాలో అత్యధికంగా భైంసాలో 41.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా నిర్మల్ పట్టణంలో సోమవారం మధ్యాహ్నం గంట పాటు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో డాక్టర్స్‌లేన్‌లోని రోడ్లపై వరద నీటితో ముంపునకు గురి అయ్యాయి. ఆ ప్రాంతం నుంచి వాహనదారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. దీంతో వాహనాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వసామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 7.157 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 2,539 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. అలాగే గడ్డెన్నవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.852 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నీటినిల్వ సామర్థ్యం 1.165 టీఎం సీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

జల్సాల కోసమే గుడిలో చోరీ

- మూడు రోజుల్లోనే బాసర ఆలయ చోరీని ఛేదించిన పోలీసులు
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి గుర్తింపు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్

బాసర, ఆగస్టు, 19: జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బును సమకూర్చే క్రమంలో నిందితుడు బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో హుండీకి కన్నం వేసినట్లు పోలీసు విచారణలో తేలింది. బుధవారం రాత్రి బాసర ఆలయంలో జరిగిన చోరీ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆలయ ప్రాంగణంలోకి చొరబడి నిందితుడు హుండీలు ధ్వంసం చేయడంతో పోలీసులు ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు. వాళ్లు అనుకున్నట్లుగానే మూడు రోజుల్లో కేసును ఛేదించి నిందితున్ని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి వివరాలను నిర్మల్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ మీడియాకు వివరాలు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం నందిగావ్ గ్రామానికి చెందిన కొసిడిగా సాయికుమార్ (21) అనే యువకుడు తాగుడికి బానిసయ్యాడు. ఆర్మూర్‌లో ఉండే సాయికుమార్ తన భార్య ఊరైన నందిగావ్‌లో గత కొంత కాలంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తాగుడు జల్సాల కోసం అలవాటు పడ్డ సాయికుమార్ సులభంగా డబ్బులు పొందాలనే ఆలోచనతో బాసర అమ్మవారి దేవస్థానం పై చోరీ చేసే ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడు. ఆలయంలోకి చొరబడి హుండీని పగలగొట్టి సొత్తును ఎత్తుకెళ్లాడు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీసు టీం సీసీ ఫుటేజీలను పరిశీలించి అందులో ఉన్న ఫోటోల ఆధారంగా కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో అతన్ని గుర్తించి పట్టుకోవడం జరిగిందని చెప్పారు. మళ్లీ ఆదివారం రోజు బాసరకు వచ్చిన నిందితుడు సాయికుమార్ పోలీసుల కంట పడడంతో అదుపులోకి తీసుకొని విచారించగా జరిగిందంతా చెప్పి నేరం ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి ఒక ఫోను, రూ. 6 వేల నగదు, తనవెంట తీసుకెళ్లిన వైట్ క్యారీబ్యాగ్, నేరం చేసే సమయంలో ధరించిన దుస్తులు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. క్లిష్టతరమైన ఈ కేసును కేవలం మూడు రోజుల్లోనే ఛేదించిన ముథోల్ సీఐ మల్లేష్, బాసర ఎస్సై గణేష్, కానిస్టేబుల్ మోహన్ సింగ్‌లను ఎస్పీ అభినందించారు.

ఆలయ భద్రతలో అనేక లోపాలు

బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో భద్రత పరంగా అనేక లోపాలు ఉన్నాయని ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. ఆలయం చుట్టూ సీసీ కెమెరాల వీడియో వాల్ ఉండాలని అన్నారు. సీసీ కెమెరాలను అనుసంధానించి ఒక్క దగ్గర చూసే విధంగా కంట్రోల్ రూమ్ ఉండాలని చెప్పారు. దేవస్థానంలోకి భక్తులు వచ్చే దారి కాకుండా వేరే మార్గాల్లో భక్తులు రాకుండా కంచె, చుట్టూ గ్రిల్స్ ఉండాలని అన్నారు. ఇవన్నీ ఏర్పాటు చేయాలని ఆలయ ఈవోకు సూచించడం జరిగిందని తెలిపారు.

'కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తా'

లక్ష్మణచాంద, ఆగస్టు 19 : కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం వంద శాతం కృషి చేస్తానని ఆ పార్టీ మీడియా అండ్ కమ్యూనికేషన్ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ ఎన్‌టి లావణ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియమించిన మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశం ప్రకారం తనవంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తానని ఆమె తెలిపారు. అంతకుముందు ఆమెను పలువురు నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంజిత్, లక్ష్మణ్, రాజేశ్వర్, నిర్మల, వెంకటస్వామి, రాజన్న, జడ్డి శ్రీనివాస్, మహేష్, ఈశ్వర్, శేఖర్, తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 19 : గాజులపేట్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో పలు ప్రాంతాలకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. కొమ్ము నారాయణ రైస్ మిల్, ఎమ్మెల్యే నివాస గృహం, భైల్ బజార్, డాక్టర్స్‌లేన్ వినియోగదారులకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 19 : జీవితంపై విరక్తి చెంది బాసగుట్ట శ్రీనివాస్ అనే వ్యక్తి సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్టు నిర్మల్‌పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వివరాలు వెల్లడిస్తూ మృతుడి భార్య చనిపోయినందున విరక్తి చెందాడన్నారు. కడెంకు చెందిన రాజు లారీ నడుపుతూ నిర్మల్‌లోని విద్యానగర్‌లో అద్దె కుంటూ జీవనం గడుపుతుండేవాడన్నారు. కొన్నేళ్ల క్రితం అతని భార్య మృతి చెందిందని తెలిపారు. అప్పటి నుండి తాగుడికి బానిసై ఒంటరి జీవితం గడపలేక ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పట్టణ ఎస్సై అశోక్ దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు.

నేడు అడెల్లి మహాపోచమ్మ వ్యాపారాలకు వేలం

సారంగాపూర్, ఆగస్టు 19 : మండలంలోని అడెల్లి మహా పోచమ్మ దేవాలయం వద్ద వ్యాపారాలకు వేలం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రంగు రవికిషన్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు విక్రయించడానికి రూ. 5 లక్షలు, ప్యాలాలు, పుట్నాలకు రూ. 75 వేలు, ఆట బొమ్మలు, కంకణాలు, సీడీలకు రూ. 75 వేలు ఇడుపుల పిల్లకు రూ. 50 వేలు, టోల్ టాక్స్‌కు రూ. 3 లక్షలు, పూల దండలకు రూ. 75 వేలు, తైబజార్ వసూల్ రూ. లక్ష ఈ వేలం పాటలో పాల్గొనే వ్యాపారస్తులందరూ డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లోని భక్తులందరూ సకాలంలో హాజరు కావాలని కోరారు.

వరదనీటిలో పడి పశువులు మృతి

సారంగాపూర్, ఆగస్టు 19 : మండలంలోని దుప్య తండాకు చెందిన రాథోడ్ రంజిత్‌కుమార్ అనే రైతు రెండు పశువులు వరద నీటిలో పడి మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. తండా వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాగు ప్రక్కన రంజిత్ కుమార్ అనే వ్యక్తి రెండు పశువులను మేతకు తీసుకవెళ్లిన సమయంలో వాగులో నుంచి భారీగా వరదరావడంతో వాగు ప్రక్కన ఉన్నటువంటి పంట పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో పశుగ్రాసం తింటున్న రెండు పశువులు వరద నీటిలో పడి మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు.

'రేపటి భారత్ బంద్‌ను జయప్రదం చేయండి'

లక్ష్మణచాంద, ఆగస్టు 19 : వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 21న చేపట్టబోయే 'భారత్‌బంద్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ బత్తుల రంజిత్ పిలుపునిచ్చారు. మండలంలోని డీఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ వలన మాలలు, మాల ఉపకులాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ కోకన్వీనర్లు బొడ్డు లక్ష్మణ్, ఎల్మల రాజేశ్వర్, నక్క రాజన్న, కుంటోళ్ల వెంకటస్వామి, ఎన్‌టి రాజేశ్వర్, ఈరోళ్ల పురుషోత్తం, బొబ్బిలి ప్రసాద్, జగదీశ్వర్, మండల కన్వీనర్లు, కోకన్వీనర్లు పాల్గొన్నారు.